# విజయ కెరటం

తెలుగు దిన పత్రిక

నల్గొండ | జులై 8 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 184 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

NALGONDA | SATURDAY AUGUST 8 2026 | VOL:16 | ISSUE: 184 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed



నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ లో ఆగస్టు 10న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన 3









## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం.. ముహూర్తం ఫిక్స్

ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం

యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు

పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

రోడ్ల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఉన్నత స్థాయి సమీక్ష

కాంట్రాక్టర్ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్న కోమటిరెడ్డి

కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరిక



రోడ్డు పనులు చేపట్టే చిన్న

(మిగతా 2వ పేజీలో..)

# ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ..

## నేతన్నలకు అండగా నిలువాలని విజ్ఞప్తి

హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం కేవలం



ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)

### సీఎం విజయ్ విడాకుల వ్యవహారంలో

## ఊహించని ట్విస్ట్...

పిటిషన్ వెనక్కి తీసుకున్న భార్య సంగీత

తాజా విచారణలో పిటిషన్‌ను ఉపసంహరించుకున్న సంగీత

నిర్ణయం వెనక కారణాలు తెలియరాలేదు



2

### భయపడొద్దు, నేనున్నాను టీఎంసీ-శివసేన రెబల్స్‌కు

## ప్రధాని మోదీ భరోసా

ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని

"ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా

పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

2



## బోనాల పండగ: సైబరాబాద్ పరిధిలో మద్యం దుకాణాలు బంద్

బోనాల పండగ సందర్భంగా సైబరాబాద్‌లో మద్యం దుకాణాల మూసివేత

ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలపై నిషేధం

ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ప్రకటన

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయమన్న పోలీసులు

హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాల నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్

(మిగతా 2వ పేజీలో..)



## రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా: సీఎం విజయ్



చెన్నై: తమిళనాడు సీఎం విజయ్ ఇవాళ రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. కావేరి జల వివాదం నేపథ్యంలో.. తమిళనాడు ప్రయోజనాల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరి అంశంలో రాజకీయం చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. మేకదాతు డ్యామ్ అంశంలో రాష్ట్రం తమ హక్కులను ఎప్పటికీ వదులుకోదన్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. కావేరి జల వివాదంపై చర్చించేందుకు ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)

## జెన్-జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు.. బీజేపీ నేతలకు సీజేపీ అభిజిత్ దీప్కే చురకలు

బీజేపీ, ఆరెస్సెస్ మధ్య సమన్వయం కొరవడిందన్న దీప్కే

జెన్-జీ నిరసనకారులు దేశ వ్యతిరేకులు కారని చెప్పిన భగవత్

భగవత్ మాటలను బీజేపీ నేతలు పాటించాలని అభిజిత్ దీప్కే సూచన

బీజేపీ నేతల పాత వ్యాఖ్యలను గుర్తు చేసిన అభిజీత్ దీప్కే

ఇది సంఘ్ పరివార్‌లోని విభేదాలకు సంకేతమని వ్యాఖ్య

బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మధ్య సమన్వయం లోపించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. జెన్-జీ యువతపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

(మిగతా 2వ పేజీలో..)



విజయ కెరటం
తెలుగు దిన పత్రిక

## వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం.. ముహూర్తం ఫిక్స్

**మొదటి పేజీ తరువాయి)**

వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా–గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి)**

కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.

## బోనాల పండగ: సైబరాబాద్ పరిధిలో మద్యం దుకాణాలు బంద్

**మొదటి పేజీ తరువాయి)**

కమిషనరేట్ పరిధిలో కీలక ఆదేశాలు వెలువడ్డాయి. పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా, ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఆగస్టు 9 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమల్లో ఉంటాయి. కుకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు మరియు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అయితే, స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాల దృష్ట్యా ఈ ఆంక్షలు విధించారు. ఇప్పటికే హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా ఇటువంటి ఆంక్షలే అమలులో ఉన్నాయి.

## జెన్–జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు.. బీజేపీ నేతలకు సీజేపీ అభిజిత్ దీప్కే చురకలు

**మొదటి పేజీ తరువాయి)**

శుక్రవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంబైలో జెన్–జీ, జెన్–ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్–జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉంది" అని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు. గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరిగినప్పుడు బీజేపీ నేత నితిన్ నబిన్ ఆందోళనకారులను 'వైరస్' అని, కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదుల బీ టీమ్' అని వ్యాఖ్యానించిన విషయాన్ని అభిజిత్ దీప్కే గుర్తు చేశారు. వారి మార్గదర్శి మాటలనే బీజేపీ నేతలు ఖాతరు చేయకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ అంశంపై మోహన్ భగవత్ నేరుగా బీజేపీ నాయకత్వంతో మాట్లాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భిన్నమైన వైఖరులు విస్తృత సంఘ్ పరివార్‌లో ఉన్న అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. తమ పార్టీ ఏ రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉండదని, కేవలం దేశం, యువతకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బృందంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ..

**మొదటి పేజీ తరువాయి)**

రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడు తున్నాయని విమర్శించారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ కార్యక్రమాలు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతి నెలా రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదేవిధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమీషన్ల కోసం ప్రైవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్తున్నారని విమర్శించారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు.

**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత రంగానికి తీవ్ర అన్యాయం**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఇప్పటికైనా మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రికి సూచించారు.

# రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా: సీఎం విజయ్

**మొదటి పేజీ తరువాయి)**

అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. కానీ మేకదాతు డ్యామ్ అంశంలో కర్నాటక సర్కారు మాత్రం దూసుకెళ్తున్నట్లు చెప్పారు. టీవీకే సర్కారుపై వస్తున్న విమర్శలకు విజయ్ కౌంటర్ ఇచ్చారు. తమిళనాడు జీవాధారం కావేరి నది అన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. తమిళనాడు జలహక్కుల కోసం కావేరి అంశంలో కర్నాటక సర్కారుతో చర్చలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం విజయ్ అన్నారు. అసెంబ్లీ పాస్ చేసిన తీర్మానాన్ని ప్రధాని మోదీకి పంపామని, మేకదాతు అంశంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో తీర్మానాన్ని సపోర్టు చేశారన్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి కూడా లేఖ రాసినట్లు విజయ్ తెలిపారు. కావేరి అంశంలో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసినట్లు చెప్పారు. 1969 నుంచి కర్నాటక డ్యామ్ ప్రాజెక్టుల అంశంలో తమిళనాడు చర్చలు నిర్వహిస్తోందన్నారు. కావేరి జల వివాదాన్ని పరిష్కరించేందుకు కర్నాటక సీఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు. దీని కోసం బెంగుళూరు కూడా వెళ్లనున్నట్లు సీఎం విజయ్ చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు శత్రు దేశాలు కూడా చర్చలు నిర్వహిస్తాయని, పక్క రాష్ట్రంతో మాట్లాడాలని నిర్ణయించానని, బెంగుళూరులో అవమానిస్తే ఏం చేస్తారని ప్రతిపక్షాలు అంటున్నాయని, అయితే తమిళనాడు ప్రజల కోసం అవమానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు విజయ్ తెలిపారు.

## సీఎం విజయ్ విడాకుల వ్యవహారంలో ఊహించని ట్విస్ట్...

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన భార్య సంగీత తాను దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. దీంతో గత కొన్ని నెలలుగా చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారానికి తాత్కాలికంగా తెరపడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చెంగల్పట్టు కోర్టును ఆశ్రయించిన సంగీత, తమ దాంపత్య బంధాన్ని రద్దు చేయాలని కోరారు. ఇద్దరి మధ్య విభేదాలు సర్దుబాటు అయ్యే పరిస్థితి లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. భరణం ఇవ్వాలని, చెన్నైలోని నీలంకరై నివాసంలో ఉండేందుకు అనుమతి కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. విడాకుల కేసు విచారణ ఈ ఏడాది పలుసార్లు వాయిదా పడింది. గత నెల జరిగిన విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ హాజరుకా లేదు. వారి తరపు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై వ్యక్తిగత కారణా లతో రాలేకపోయినట్లు తెలిపారు. అనంతరం విచారణను ఆగస్టు 7కు వాయి దా వేశారు. తాజా విచారణ సందర్భంగా సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఆమె నిర్ణయానికి గల కారణాలపై మాత్రం ఎలాం టి అధికారిక సమాచారం వెల్లడికాలేదు. సంగీత వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న కోర్టు, పిటిషన్‌ను ఉపసంహరించుకోవ డానికి అనుమతి ఇచ్చింది. ఈ కేసును "విత్‌డ్రాన్"గా పరిగణిస్తూ మూసివేస్తున్నట్లు (డిస్పోజ్) ప్రకటించింది. సంగీత నిర్ణయంపై విజయ్ తరపు న్యాయవాది ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. భవిష్యత్తులో అవసరమైతే మళ్లీ కొత్త పిటిషన్ దాఖలు చేసుకునేందుకు సంగీతకు కోర్టు స్వేచ్ఛనిచ్చింది. 1999లో విజయ్, సంగీత వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. ఇటీవల విజయ్ రాజకీయాల్లో పూర్తిస్థాయిలో చురుగ్గా మారిన తర్వాత ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు తరచూ చర్చకు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన భర్త విజయ్‌కు మరో నటితో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయం 2021లోనే తనకు తెలిసిందని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు. సంబంధం మానుకుంటానని హామీ ఇచ్చి కూడా విజయ్ దానిని కొనసాగించారని, తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని పేర్కొన్నారు. అంతేకాకుండా, సదరు నటితో కలిసి దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడం, తనపై ఆర్థిక ఆంక్షలు విధించడం, రాకపోకలపై పరిమితులు పెట్టడం వంటి చర్యలతో తనను, తమ ఇద్దరు పిల్లలను (జాసన్ సంజయ్, దివ్య సాషా) తీవ్ర మానసిక క్షోభకు గురిచేశారని సంగీత ఆరోపించారు. తమ వివాహ బంధం కోలుకోలేని విధంగా దెబ్బతిన్నదని అప్పట్లో ఆమె పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సంచలన ఆరోపణల కేసును ఆమె ఉపసంహరించుకోవడం తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### భయపడొద్దు, నేనున్నాను టీఎంసీ–శివసేన రెబల్స్‌కు

# ప్రధాని మోదీ భరోసా

**మొదటి పేజీ తరువాయి)**

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొం టూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదిం చవచ్చని తెలిపా రు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి



తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

విజయకేరటం
తెలుగు దిన పత్రిక
ఆగస్టు । శనివారం । 8 । 2026


# ఆసీస్ క్రికెట్ లెజెండ్ షేన్ వాట్సన్ పుస్తకమే స్ఫూర్తి.. ఆసియా గేమ్స్‌పై గురిపెట్టిన భారత ఆర్చర్

**షేన్ వాట్సన్ పుస్తకంతో స్ఫూర్తి పొందిన భారత ఆర్చర్ సాహిల్ జాదవ్**

**తొలి జాతీయ పతకం కోసం ఏడేళ్లు నిరీక్షించిన సాహిల్**

**తన కన్నా కుటుంబమే ఎక్కువ త్యాగం చేసిందని వెల్లడి**

**ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా కఠిన సాధన**

**ఒత్తిడిలో చేసే చిన్న పొరపాట్లే పతకాలను దూరం చేస్తున్నాయని వ్యాఖ్య**

క్రికెట్‌కు, ఆర్చరీకి పెద్దగా సంబంధం ఉండకపోవచ్చు. కానీ, స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచైనా, ఎవరి నుంచైనా రావొచ్చు. భారత యువ ఆర్చర్ సాహిల్ జాదవ్ విషయంలో ఇదే నిజమైంది. ఆస్ట్రేలియా మాజీ ఆల్-రౌండర్ షేన్ వాట్సన్ రాసిన ఓ పుస్తకం నుంచి స్ఫూర్తి పొందిన సాహిల్, ఇప్పుడు ఆసియా క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.సుమారు నెల రోజుల క్రితం, షేన్ వాట్సన్ రాసిన 'ది విన్నర్స్ మైండ్‌సెట్' అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించినట్లు సాహిల్ తెలిపాడు. "కేవలం మొబైల్ ఫోన్‌పై సమయం తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ పుస్తకం చదవడం మొదలుపెట్టాను. కానీ, పోటీల సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, ఏకాగ్రతను ఎలా నిలుపుకోవాలి అనే విషయాలపై ఎంతో విలువైన జ్ఞానాన్ని పొందాను" అని సాయ్ మీడియాతో మాట్లాడుతూ సాహిల్ వివరించాడు.25 ఏళ్ల సాహిల్ కెరీర్‌లో మానసిక దృఢత్వం, ఓపిక కీలక పాత్ర పోషించాయి. 19 ఏళ్ల వయసులో ఆలస్యంగా ఆర్చరీ ప్రారంభించిన అతను, తొలి జాతీయ పతకం సాధించడానికి ఏకంగా ఏడేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ కఠిన సమయంలో తన కుటుంబం అండగా నిలిచిందని, ఎన్నో త్యాగాలు చేసిందని సాహిల్ గుర్తుచేసుకున్నాడు. "ప్రతి సంవత్సరం చాలా స్వల్ప తేడాతో అవకాశాలు చేజార్చుకునేవాడిని. నాకంటే నా కుటుంబమే ఎక్కువ త్యాగాలు చేసింది. వాళ్ల మద్దతు వల్లే నేను



నిలబడగలిగాను" అని పేర్కొన్నాడు.ఏళ్ల తరబడి పడిన శ్రమకు ఫలితం దక్కింది. 2024లో సీనియర్ నేషనల్స్‌లో స్వర్ణం గెలిచి తొలి జాతీయ పతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత 2025 వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. ఈ ఏడాది షాంఘైలో జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2లో కాంస్య పతకం సాధించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. "పతకం అందుకున్నప్పుడు నా తల్లిదండ్రులు, వారి త్యాగాలు, నా కష్టం గుర్తొచ్చాయి" అని సాహిల్ భావోద్వేగంగా చెప్పాడు.వచ్చే నెలలో జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల కోసం సాహిల్ తీవ్రంగా సాధన చేస్తున్నాడు. "భారత జట్టుకు ఎంపిక కావడమే ప్రపంచంలో అత్యంత కఠినమైన ప్రక్రియ. జట్టులో చోటు దక్కించుకున్నామంటే, ప్రపంచంలో అత్యుత్తమ క్రీడాకారులను ఓడించే సత్తా మనకుంది. కానీ కొన్నిసార్లు మనవాళ్లు ఒత్తిడికి గురై చిన్న చిన్న పొరపాట్లు చేసి పతకాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించి 100 శాతం ప్రదర్శన ఇస్తే పతకాలు సాధించడం కష్టం కాదు" అని సాహిల్ విశ్లేషించాడు. ప్రస్తుతం కోల్‌కతాలోని సాయ్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ పొందుతున్న అతను, తన విజయాల వెనుక సాయ్ సహకారం ఎంతో ఉందని కృతజ్ఞతలు తెలిపాడు.

# పుజారాను చూసి బౌలింగ్ ఆపేసిన హేజిల్‌వుడ్.. సీఎస్‌కే క్యాంపులో అసలేం జరిగింది?

**సీఎస్‌కే నెట్స్‌లో తనకు బౌలింగ్ వేసేందుకు హేజిల్‌వుడ్ నిరాకరించాడన్న పుజారా**

**2021 ఐపీఎల్ సీజన్ సమయంలో ఈ ఘటన జరిగిందని గుర్తుచేసుకున్న మాజీ క్రికెటర్**

**టెస్టుల్లో తన బ్యాటింగ్‌తో విసిగించడం వల్లే హేజిల్‌వుడ్ అలా చేసి ఉండొచ్చని వ్యాఖ్య**


**ఆ ఐపీఎల్ సీజన్ నుంచి వ్యక్తిగత కారణాలతో తప్పుకున్న హేజిల్‌వుడ్**

టీమిండియా టెస్ట్ స్పెషలిస్ట్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌కు సంబంధించిన ఒక పాత సంఘటనను తాజాగా గుర్తుచేసుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తరపున ఆడుతున్న సమయంలో నెట్ ప్రాక్టీస్‌లో తనకు బౌలింగ్ చేయడానికి హేజిల్‌వుడ్ నిరాకరించాడని పుజారా వెల్లడించాడు.2021 ఐపీఎల్ సీజన్‌లో పుజారా, హేజిల్‌వుడ్ ఇద్దరూ సీఎస్‌కే జట్టులో ఉన్నారు. అయితే, ఆ సీజన్ ప్రారంభానికి ముందు, బిజీ అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా విశ్రాంతి కోరుకుంటున్నానంటూ హేజిల్‌వుడ్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. అప్పట్లో పుజారా జట్టులో ఉండటం వల్లే హేజిల్‌వుడ్ సరదాగా ఈ నిర్ణయం తీసుకున్నాడంటూ సోషల్ మీడియాలో జోకులు కూడా పేలాయి.భారత్-ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్‌లలో పుజారా తన డిఫెన్సివ్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తాడన్న పేరుంది. ముఖ్యంగా హేజిల్‌వుడ్‌కు పుజారా చాలా ఓవర్ల పాటు బౌలింగ్ చేసి విసిగిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సీఎస్‌కే నెట్స్‌లో మళ్లీ తనకు బౌలింగ్ చేసి విసుగు తెచ్చుకోవడం ఇష్టం లేక హేజిల్‌వుడ్ అలా చేసి ఉండవచ్చని పుజారా సరదాగా గుర్తుచేసుకున్నాడు. ఈ ప్రాక్టీస్ సెషన్ ఘటనపై హేజిల్‌వుడ్ కానీ, ఫ్రాంచైజీ కానీ అధికారికంగా ఎప్పుడూ స్పందించలేదు.




# ప్రపంచ అండర్20 అథ్లెటిక్స్: అష్ఫాక్ సంచలనం.. జాతీయ రికార్డు బద్దలు!

ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 (యూ20) ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ స్ప్రింటర్ మహమ్మద్ అష్ఫాక్ సంచలనం సృష్టించాడు. పురుషుల 400 మీటర్ల రేసులో జాతీయ రికార్డును బద్దలు కొడుతూ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. మరోవైపు, హైజంప్‌లో బసంత్ ఫైనల్‌కు అర్హత సాధించి భారత శిబిరంలో ఆనందం నింపాడు.అమెరికాలోని యూజీన్ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో, పురుషుల 400 మీటర్ల హీట్స్‌లో అష్ఫాక్ అద్భుత ప్రదర్శన చేశాడు. రేసును కేవలం 45.81 సెకన్లలో పూర్తి చేసి, తన పేరిట ఉన్న 46.05 సెకన్ల జాతీయ అండర్ 20 రికార్డును తానే తిరగరాశాడు. హీట్స్‌లో రెండో స్థానంలో నిలిచినప్పటికీ, అత్యుత్తమ టైమింగ్‌తో సెమీస్‌కు అర్హత సాధించాడు. ఓవరాల్‌గా క్వాలిఫయర్స్ అందరిలోనూ నాలుగో అత్యుత్తమ సమయం నమోదు చేయడం విశేషం. అష్ఫాక్ విజయం అందించిన ఉత్సాహంలోనే, ఫీల్డ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు శుభవార్త అందింది. హైజంప్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో యువ అథ్లెట్ బసంత్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతడు 2.00, 2.05, 2.10 మీటర్ల మార్కులను తొలి ప్రయత్నంలోనే దాటి, 2.14 మీటర్ల ఎత్తును రెండో ప్రయత్నంలో క్లియర్ చేసి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు.




టోర్నీ ఆరంభ రోజే ఇద్దరు భారత యువ అథ్లెట్లు సత్తా చాటడంతో భారత క్రీడా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సెమీఫైనల్‌లోనూ ఇదే జోరు కొనసాగించి అష్ఫాక్ పతకం దిశగా అడుగులు వేయాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ లో ఆగస్టు 10న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- **ఈనెల 10వ తేదీన నాగార్జునసాగర్ కి సీఎం రేవంత్ రెడ్డి..!**
- **వరుణ యాగం లో పాల్గొననున్న జవీ..**
- **కాసేపట్లో.. వరుణ యాగం స్థల పరిశీలన చేయనున్న కలెక్టర్ చంద్రశేఖర్, SP శరత్ చంద్ర పవర్..**

రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలి, కృష్ణా-గోదావరి నదులు కళకళలాడాలని మహా వరుణ యాగం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం... నాగార్జున సాగర్ జలాశయం ఒడ్డున విజయ విహార్ ఆవరణలో ఆగస్టు 10న సోమవారం మహా వరుణ యాగం.. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్న వరుణ యాగం.. దేవస్థాన బోర్డు ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహణ.. యాగానికి ఏర్పాట్లు ముమ్మరం.. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి యాగ బాధ్యతలు అప్పగింత.. ఆగస్టు 10న సాయంత్రం 3:20 నుండి 3:24 నిమిషాల మధ్య జరగనున్న పూర్ణాహుతి.. హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు.. మహా వరుణ యాగంలో పాల్గొననున్న 108 మంది ఋత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం.. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, 'ఎల్ నినో' ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం.. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ, శ్రీశైలం నుంచి ఇంకా నీరు రాకపోవడంతో డెడ్ స్టోరేజ్‌లోనే నాగార్జున సాగర్.. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవకాశం.. సాగర్ కింద 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండటంతో ప్రత్యేక పూజలు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి..

# భారత్‌తో టెస్ట్ సిరీస్: అభిమానులకు శ్రీలంక బోర్డు బంపరాఫర్

**భారత్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌లకు ఉచిత ప్రవేశం**

**శ్రీలంక క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన**

**గాలె, కొలంబోలలో జరగనున్న రెండు టెస్ట్ మ్యాచ్‌లు**

**ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సిరీస్**

క్రికెట్ అభిమానులకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బోర్డు తీపి కబురు అందించింది. భారత్‌తో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను వీక్షించేందుకు స్టేడియం లోకి అభిమాను లకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్న ట్లు శు క్రవారం ప్రకటిం చింది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది.ఈ సిరీస్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025--27లో భాగంగా జరగనుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలె అంతర్జాతీయ స్టేడియంలో, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనున్నాయి. ప్రేక్షకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్టేడియంలోకి ప్రవేశించేందుకు ప్రత్యేక ద్వారాలను కేటాయించారు. గాలె స్టేడియంలో గేట్ నెంబర్ 4 ద్వారా, కొలంబో స్టేడియంలో గేట్లు నెంబర్లు 3, 4, 5, 7 ద్వారా ప్రేక్షకులను అనుమతిస్తారు. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో భారత్ 5వ స్థానంలో ఉండగా, శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో శ్రీలంక పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు, యువ క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మ్యాచ్‌లకు హాజరు కావాలని శ్రీలంక క్రికెట్ బోర్డు పిలుపునిచ్చింది.

# భారత స్పిన్నర్లు రాణించినా.. తొలిరోజు లంక ఎలెవన్ భారీ స్కోరు

శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు ఆడుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ తొలిరోజు ఆట ముగిసింది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ రాణించినప్పటికీ, శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 363 పరుగుల భారీ స్కోరు సాధించింది.శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్ మదుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలపై ఆధిపత్యం చెలాయించారు. అయితే, మదుష్క రనౌట్‌గా వెనుదిరగడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది.భోజన విరామం తర్వాత భారత స్పిన్నర్లు పుంజుకున్నారు. ఐపీఎల్ 2026 తర్వాత తొలిసారి బరిలోకి దిగిన రవీంద్ర జడేజా (2/64) కీలక వికెట్లు పడగొట్టాడు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ (2/48), కుల్దీప్ యాదవ్ (2/76) కూడా తమ స్పిన్‌తో లంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఫ్లాట్‌గా ఉన్న పిచ్‌పై స్పిన్నర్లు టర్న్ రాబట్టడంతో శ్రీలంక మిడిల్ ఆర్డర్ తడబడింది.లంక జట్టులో కెప్టెన్ సోనాల్ దినూష (52) కూడా హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా దూరమవడంతో ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత బౌలర్లకు ఇది మంచి ప్రాక్టీస్‌గా ఉపయోగపడినప్పటికీ, తొలిరోజే 360కి పైగా పరుగులు ఇవ్వడం ఆందోళన కలిగించే అంశం.

విజయ కెరటం
తెలుగు దిన పత్రిక

## ఇది నీ శ్రమకు తగిన ప్రతిఫలం వరుణ్.. 'కొరియన్ కనకరాజు'పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంస






మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'కొరియన్ కనకరాజు' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. హారర్-కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో, మెగాస్టార్ చిరంజీవి చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.ఈ సినిమా గురించి ఎక్కడ చూసినా 'నవ్వులే నవ్వులు' అనే మాట వినిపిస్తోందని చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "డియర్ వరుణ్ తేజ్.. నువ్వు ఈ విజయానికి పూర్తిగా అర్హుడివి. నీ శ్రమకు, నిజాయతీకి సరైన ప్రతిఫలం దక్కింది" అని అభినందించారు. దర్శకుడు మేర్లపాక గాంధీ, కమెడియన్ సత్య, హీరోయిన్ రితికా నాయక్, నిర్మాతలకు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ అనంతపురం యువకుడిగా, విలక్షణమైన బాడీ లాంగ్వేజ్, రాయలసీమ యాసలో మాట్లాడి అలరించారు. అనంతపురం జిల్లా పెనుగొండ నేపథ్యంలో సాగే ఈ కథలో, కియా కంపెనీలో పనిచేసే అమ్మాయిని ప్రేమించడం, ఆపై కొరియన్ సంస్కృతికి సంబంధించిన పరిణామాలు నవ్వులు పూయిస్తాయి.తాను త్వరలోనే ఈ చిత్రాన్ని చూస్తానని, ఇది మరింత పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు చిరంజీవి తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం మెగాస్టార్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఉదయనిధిని విజయ్ అరెస్ట్ చేయిస్తారని కలలో కూడా ఊహించలేదు: విశాల్

**రాజకీయ నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్న విశాల్**

**కాలేజీలో విజయ్ తన సీనియర్, ఉదయనిధి తన బ్యాచ్‌మేట్ అని వెల్లడి**

**ఉదయనిధి అరెస్ట్ పొలిటికల్ గేమ్ లో భాగమేనని వ్యాఖ్య**



రాజకీయ నాయ కులు బహిరంగ వేదికలపై మాట్లాడేట ప్పుడు అత్యం త జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ సినీ నటుడు విశాల్ సూచించారు. ఆయన దర్శకత్వం వహించి, కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మకుటం' (తమిళంలో 'మగుడం') సినిమా ప్రచారానికి సంబంధించిన ఇంటర్వ్యూలో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, నటి త్రిషపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించారు.సభలలో మాట్లాడే ముందు సిద్ధం చేసుకున్న ప్రసంగాలు అయితే ఎలాంటి ఇబ్బందులు రావని, అప్పటికప్పుడు మాట్లాడే సమయంలోనే పొరపాట్లు దొర్లుతాయని విశాల్ అభిప్రాయపడ్డారు. "లయోలా కాలేజీలో నా సీనియర్ (విజయ్), నా బ్యాచ్‌మేట్ (ఉదయనిధి) ని ఇలా ఒకరోజు అరెస్ట్ చేయిస్తారని కలలో కూడా ఊహించలేదు. ప్రస్తుతం విజయ్ రాజకీయాల్లో ఉన్నారు, ఇదంతా పొలిటికల్ గేమ్‌లో భాగమే" అని విశాల్ వ్యాఖ్యానించారు. మరోవైపు, తమిళనాడు రాజకీయాల్లో విశాల్ ఎంట్రీపై కూడా ఊహాగానాలు జోరందుకున్నాయి.

## రామ్‌చరణ్ 'పెద్ది' ప్లస్సులు, మైనస్సులు ఇవే: పరుచూరి గోపాలకృష్ణ

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటించిన స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' చిత్రంపై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సినిమాను రామ్ చరణ్ తన భుజస్కందాలపై మోశారని ఆయన ప్రశంసించారు. అయితే, అదే సమయంలో చిత్రంలోని కొన్ని కీలక లోపాలను కూడా ఆయన ఎత్తిచూపారు. ముఖ్యంగా సినిమా నిడివి ఎక్కువగా ఉండటం, కథానాయిక పాత్ర పరిమితంగా ఉండటం ప్రధాన మైనస్‌లుగా ఆయన పేర్కొన్నారు.తన 'పరుచూరి పాఠాలు' సిరీస్‌లో భాగంగా ఆయన ఈ విశ్లేషణ చేశారు. ఓటు హక్కు లేని ఒక గ్రామానికి రైలు ఆగేలా చేసి, ఆ ఊరికి గుర్తింపు తీసుకురావాలనే ఒక చిన్న పాయింట్‌తో మూడు గంటలకు పైగా కథగా చెప్పడం సాహసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. "రామ్ చరణ్ కాకుండా మరెవరైనా హీరోగా నటించి ఉంటే, ఈ స్థాయి ఫలితం వచ్చేది కాదేమో. తన నటనతో సినిమాను అతడే నడిపించాడు. చిత్ర వసూళ్లకు అతడే ప్రధాన కారణం" అని పరుచూరి స్పష్టం చేశారు. అలాగే జగపతి బాబు నటన, ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం బాగున్నాయని కొనియాడారు. కాగా, చిత్రంలోని లోపాలను కూడా పరుచూరి వివరించారు. హీరో హీరోయిన్ల ఆహార్యం, వేషధారణ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా లేవని, వారు కొండ ప్రాంతవాసుల్లా కనిపించారని పేర్కొన్నారు. కథలో హీరోయిన్ పాత్రకు తగిన ప్రాధాన్యత లేదని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమా రన్‌టైమ్‌ను కనీసం 30 నుంచి 40 నిమిషాల వరకు తగ్గించి ఉంటే బాగుండేదని సూచించారు. నిడివిని తగ్గించి, హీరోయిన్ పాత్రను మరింత పెంచి ఉంటే ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం మరింత మంది ప్రేక్షకులకు చేరువయ్యేదని ఆయన అన్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించారు.

# భావోద్వేగభరితంగా 'విశ్వనాథ్ & సన్స్' ట్రైలర్ !

**సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ట్రైలర్ విడుదల**

**ట్రైలర్‌లో ఆకట్టుకునే భావోద్వేగాలు**

**ఆలోచింపజేసే సంభాషణలు**

**ఆగస్టు 14న చిత్రం విడుదల**

తమిళ కథానాయకుడు సూర్య నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం 'విశ్వనాథ్ ద సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం (నేడు) విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందుతోన్న కుటుంబ కథా చిత్రంగా 'విశ్వనాథ్ ద సన్స్' ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే విషయాన్ని ట్రైలర్ ద్వారా మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. 'నా బాబు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాలి' అంటూ రాధికా శరత్ కుమార్ డైలాగ్ నుంచి, గెలిచే వరకు ఆగకూడదు.. గెలిచిన తరువాత ఆ గెలుపు గురించి ఎక్కువ మాట్లాడకూడదు అంటూ సూర్య చెప్పే డైలాగ్ వరకు ట్రైలర్ ఆద్యంతం ఎంతో భావోద్వేగభరితంగా అనిపిస్తుంది. 'నీ సీటు చాలా స్ట్రాంగ్', 'ఇప్పుడు ఎందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ కథనాయిక మమితా బైజు సూర్యను టీజ్ చేస్తూ చెప్పే సంభాషణలు ఫన్నీగా అనిపించాయి. ట్రైలర్‌లో ఎమోషన్స్, సెన్సిటివ్ ఎంటర్‌టైన్‌మెంట్, సెంటిమెంట్ ఇలా అన్నీ మిక్స్ చేసి దర్శకుడు సినిమా కథాంశాన్ని ఆడియన్స్‌కు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. నలభై ఏళ్ల వయసులో అంతర్జాతీయ పిస్టల్ షూటర్‌గా సూర్య ఎలా ఎదిగాడు? అనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ట్రైలర్‌తో ఆసక్తి కలిగించి సినిమా గురించి వెయిట్ చేసే విధంగా దర్శకుడు వెంకీ అట్లూరి చేసిన ట్రైలర్ కట్ బాగుంది. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఆహ్లాదంగా అనిపించింది.





## 'ధురంధర్' ప్రభంజనం.. వరల్డ్ నెం.1 నాన్-ఇంగ్లీష్ చిత్రంగా రికార్డ్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వీక్షణలు పొందిన నాన్-ఇంగ్లీష్ చిత్రంగా ఈ సినిమా రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ కో-సీఈవో టెడ్ సరాండోస్ వెల్లడించారు.'ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, , ఈ ఏడాది అమెరికా, యూకే చిత్రాల తర్వాత అంతర్జాతీయంగా అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా 'ధురంధర్' నిలిచిందని పేర్కొన్నారు. గణాంకాల ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఈ సినిమా ఏకంగా 37 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఏకకాలంలో 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ చార్టులలో ఈ చిత్రం అగ్రస్థానంలో నిలవడం విశేషం.ఆదిత్య ధర్ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందిన ఈ ఫ్రాంచైజీ, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి సత్తా చాటింది. 2025 డిసెంబర్‌లో విడుదలైన మొదటి భాగం ఘనవిజయం సాధించగా, ఈ ఏడాది మార్చిలో వచ్చిన సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' భారత్‌లో రూ. 1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది.భారతీయ కంటెంట్‌కు అంతర్జాతీయంగా ఆదరణ విపరీతంగా పెరుగుతోందని టెడ్ సరాండోస్ కొనియాడారు. 2024 నుంచి ప్రతీ వారం ఏదో ఒక భారతీయ సినిమా లేదా సిరీస్ నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్-10 జాబితాలో స్థానం సంపాదించుకుంటోందని ఆయన గుర్తుచేశారు. 'స్క్విడ్ గేమ్' లేదా 'మనీ హీస్ట్' వంటి భారీ గ్లోబల్ హిట్స్ భారత్ నుంచి ఎప్పుడు వస్తాయని చాలామంది అడుగుతుంటారని, అయితే భారతీయ చిత్రాలు ఇప్పటికే ఆ స్థాయి ఘనతను తరుచూ సాధిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528